

'డబుల్' ఇళ్ల ఆక్రమణ

ధర్పల్లిలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను పంపిణీ చేయకపోవడంతో 30 కుటుంబాలు వాటిని ఆక్రమించాయి.

- 8లో ▸



కల్తీ కల్లుతో ప్రయోగాలు..

సంపాదనే ధ్యేయంగా వ్యాపారులు కల్తీ కల్లు తయారు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
40.8 /22.3

వాతావరణం


ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

ముడుపులే పరమావధి

- నిజామాబాద్ కార్పొరేషన్‌లో టౌన్‌ప్లానింగ్ విభాగం ఇష్టారాజ్యం
- నిబంధనలు అతిక్రమించి చేపడుతున్న నిర్మాణాలకు ప్రోత్సాహం
- కమిషనర్‌కు తెలియకుండానే కథ నడిపిస్తున్నట్లు అనుమానాలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిబంధనలను తుంగలో తొక్కి.. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టి ముడుపులే పరమావధిగా నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు పని చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల వెలుగు చూసిన కొన్ని ఘటనలు ఆ ఆరోపణలకు బలాన్నిస్తున్నాయి. అక్రమాలకు అధికారులే మార్గాలు చూయిస్తూ ప్రోత్సహిస్తున్నారని, మరోవైపు విచారణకు బదులు సెటిల్‌మెంట్లు చేస్తున్నారని నగరవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

■ ఖలీల్‌వాడిలో కేవలం 250 గజాల స్థలంలో ఓ ఆస్పత్రి భవనాన్ని నిర్మిస్తున్నారు. అయితే ఇక్కడ అనుమతులు లేకుండానే సెల్లార్ నిర్మాణం చేపడుతున్నారని ఓ వైద్యుడు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోకపోగా ఈ అక్రమానికి దన్నుగా నిలిచినట్లు తెలుస్తోంది. దీంతో ఫిర్యాదుదారుడు కమిషనర్‌కు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. అయినప్పటికీ చర్యలు తీసుకోకపోవడంతో ఫిర్యాదుదారుడు హైకోర్టుకు వెళ్లాడు. ఆ తరువాత స్పందించిన నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్ సెల్లార్ నిర్మాణాన్ని నిలిపి వేయించారు.



మున్సిపల్ కార్పొరేషన్‌లో కీలకమైన టౌన్‌ప్లానింగ్ విభాగం డబ్బులే పరమావధిగా పని చేస్తోందనే ఆరోపణలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. నిజామాబాద్ నగరాభివృద్ధికి ప్లాన్ చేయాల్సిన ఆ విభాగం అధికారులు, సిబ్బంది తమ జేబులు నింపుకునే 'ప్లాన్'ను అమలు చేస్తున్నారని నగరవాసులు అంటున్నారు. కళ్లముందే వెలిసిన బహుళ అంతస్తుల నిర్మాణాల వెనుక నడుస్తున్న.. నడిపిస్తున్న కథలు టౌన్‌ప్లానింగ్ పనితీరును ఎత్తిచూపుతున్నాయి.

ఎఫెక్ట్ ఏరియా ఎక్కడ..?

■ బొంబాయి నర్సింగ్ హోమ్ సమీపంలో పాత అరోమా బిల్డింగ్ ముందున్న రోడ్డు 120 అడుగులు ఉండాలి. దీంతో ఆ బిల్డింగ్ వాళ్లు రోడ్డు కోసం గిఫ్ట్ కింద 18 అడుగుల పొడవుతో నగరపాలక సంస్థకు 134 గజాలు గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసిచ్చారు. ఉత్తరం వైపు ఐదు అడుగుల రోడ్డు ఎఫెక్ట్ ఏరియా చూపించినప్పటికీ ఎఫెక్ట్ ఏరియాను వదిలేయకుండా నిర్మిస్తున్నారు. స్టిల్ ప్లేస్, అప్పర్ ఫ్లోర్స్ అనుమతులు తీసుకుని, సెల్లార్ అనుమతులు లేకుండానే కట్టారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో నగరపాలక సంస్థ నుంచి 2024 అక్టోబర్ 8వ తేదీన బిల్డింగ్ ఓనర్లకు నోటీసులిచ్చారు. కానీ చర్యలు తీసుకోలేదు. టీపీవో దన్నుతో నిర్మాణం కొనసాగుతోందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

■ ఎల్ఆర్ఎస్ కోసం ఓ వ్యక్తి లైసెన్స్‌డ్ ఇంజినీర్‌ను సంప్రదించగా టీపీవో సహకారంతో ఆయన నకిలీ ఎల్ఆర్ఎస్ సృష్టించాడు. దీనిని అడ్డుపెట్టుకొని ప్లాట్ యజమానిని కొందరు ఉద్యోగులు బ్లాక్‌మెయిల్ చేశారు. అయితే ఇది నకిలీ ఎల్ఆర్ఎస్ ధ్రువీకరణ అని ప్లాట్ ఓనర్‌కు తెలియదు. దీనిపై అతడికి టౌన్‌ప్లానింగ్ అధికారులు నోటీసులు పంపించగా, సదరు వ్యక్తి లైసెన్స్‌డ్ ఇంజినీర్ వద్దకు వెళ్లి చూపించాడు. ప్లాట్ యజమాని సంతకాన్ని ఫోర్జరీ చేసి ఇంజినీర్ ఆ నోటీసుకు వివరణ పంపించాడు. అయినప్పటికీ ఫీజు కట్టాల్సిందేనని మరో నోటీసు అందడంతో చివరకు ప్లాట్ యజమాని నకిలీ ఎల్ఆర్ఎస్ సృష్టించిన ఇంజినీర్‌పై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు వ్యక్తి ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదు. తరువాత బాధితుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. కలెక్టర్ విచారణకు ఆదేశించినప్పటికీ టౌన్‌ప్లానింగ్ అధికారి స్పందించలేదు. పైగా ఇంజినీర్‌ను కాపాడేందుకు టౌన్‌ప్లానింగ్ అధికారి ప్లాట్ ఓనర్‌ను బెదిరించి ఫీజు కట్టించారు. ఫిర్యాదును విత్‌డ్రా చేసుకోవాలని బ్లాక్‌మెయిల్ చేయడం గమనార్హం. ఇక్కడ కలెక్టర్‌ను సైతం టౌన్‌ప్లానింగ్ అధికారులు మోసం చేయడం విశేషం. దీనిపై నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్‌ను వివరణ కోరగా అన్ని కేసులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటానన్నారు.

బిల్డర్ వదిలేసి వెళ్తే పరిస్థితి ఏమిటో..

నిజామాబాద్‌లోని కేసీఆర్ కాలనీలో 60 ఫ్లాట్లతో ఓ భారీ అపార్ట్‌మెంట్ నిర్మిస్తుండగా, ఇప్పటివరకు 30 మంది ఫ్లాట్లు కొనుక్కున్నారు. అయితే 2023 జూన్‌లో కొనుగోలుదారులకు పూర్తిగా అప్పగించేలా బిల్డర్ ఒప్పందం చేసుకున్నారు. అయితే ఇప్పటి వరకు బిల్డర్ ఫ్లాట్లను అప్పగించకపోవడంతో బ్యాంకు రుణాలు తీసుకున్నవారు ఇబ్బందులు పడుతున్నారు. పైగా విజిటర్స్ పార్కింగ్ ప్లేస్‌లో జిమ్, క్లబ్ హౌస్ నిర్మాణం చేపట్టగా వీటికి ఎలాంటి అనుమతులు లేవు. మరోవైపు నాల్గో ఫ్లోర్, ఐదో ఫ్లోర్‌లో నిబంధనలకు విరుద్ధంగా 9 అడుగులకు బదులు, 8 అంగుళాలు తగ్గించి కేవలం 8.4 అడుగులు మాత్రమే రూఫ్ ఉండేలా స్లాబ్ వేయడం గమనార్హం. మున్సిపల్ కమిషనర్ నుంచి ఎన్‌వోసీ తీసుకోకుండానే సెమీ ఫినిష్‌డ్‌గా చూపించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. ఈ పరిస్థితుల్లో బిల్డర్ నిర్మాణం పూర్తి చేయకుండా తక్షణం వదిలేసిపోయినా ఏమీ చేయలేని స్థితిలోకి తాము నెట్టబడ్డామని కొనుగోలుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్, సీడీఎంఏకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేదని అంటున్నారు. చేసేది లేక కొందరు కొనుగోలుదారులు అడ్వొకేట్ నోటీసు పంపించారు. త్వరలో రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీకి ఫిర్యాదు చేస్తామని చెబుతున్నారు. ఈ అంశంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది మున్సిపల్ కమిషనర్‌ను తప్పుదోవ పట్టిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

హాస్టళ్లలో డాగ్ స్క్వాడ్ తనిఖీలు



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని వసతిగృహాలు, కళాశాలల్లో పోలీసు డాగ్‌స్క్వాడ్ బృందాలు, స్పెషల్ టీములు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టాయి. సీపీ సాయిచైతన్య ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టిన పోలీసు సిబ్బంది విద్యార్థులకు, యువకులకు డ్రగ్స్ వాడకంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు.

11న అర్సపల్లిలో టేకు చెట్ల వేలం

డొంకేశ్వర్(ఆర్మూర్): నగరంలోని అర్సపల్లి మత్స్య శాఖకు చెందిన ప్రాంగణంలో మార్క్ చేసిన పన్నెండు టేకు చెట్లను ఈ నెల 11న ఉదయం 10గంటలకు వేలం వేయనున్నట్లు మత్స్య శాఖ అధికారి ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ అనుమతితో అటవీ శాఖ అధికారులు నిర్ణయించిన ధరకు వేలం వేస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు రూ.5వేలు చెల్లించి వేలంలో పాల్గొనాలని, వేలంలో చెట్లను దక్కించుకున్నవారు అటవీ అధికారులతో పర్మిట్‌తో దుంగలను తీసుకెళ్లాలని సూచించారు. వేలంలో పాల్గొనేందుకు చెల్లించిన రూ.5వేలు తిరిగి ఇవ్వబడవని స్పష్టం చేశారు.

న్యూస్‌రీల్

ఆర్టీసీ సిబ్బందికి 'ప్రగతి చక్రం' పురస్కారాలు



ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు 'ప్రగతి చక్రం' పురస్కారాలను అందజేసినట్లు ఆర్ఎం జ్యోత్స్న మంగళవారం తెలిపారు. ఉత్తమ సిబ్బందికి త్రైమాసిక పురస్కారాలను అందజేశామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం ఎస్ మధుసూదన్, డిపో మేనేజర్లు, పర్సనల్ ఆఫీసర్, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఉషూలో కాంస్య పతకం



నిజామాబాద్‌నాగారం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాస్‌పూర్‌లో గత నెల 24 నుంచి 28వ తేదీ వరకు జాతీయ ఉషూ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో నగరంలోని కేర్ డిగ్రీ కళాశాల విద్యార్థి బిలాల్ కాంస్య పతకం సాధించాడు. తెలంగాణ తరఫున సీనియర్ స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించిన బిలాల్‌ను కళాశాల డైరెక్టర్ నరాల సుధాకర్, ప్రిన్సిపల్ బాలకృష్ణ సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడాకారులను ప్రోత్సహించడంలో తమ కళాశాల ఎప్పుడూ ముందుంటుందన్నారు. క్రీడాకారులకు సహాయసహకారాలు అందిస్తూ ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా బిలాల్ కళాశాల యాజమాన్యానికి బిలాల్ కృతజ్ఞతలు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ నరేశ్, కళాశాల ప్రతినిధులు కొయ్యాడ శంకర్, సందేశ్, సందీప్ పాల్గొన్నారు.

వీడీసీపై చర్యలు తీసుకోవాలి



ఖలీల్‌వాడి: ఏర్గట్ల మండలంలోని తాళ్లరాంపూర్ వీడీసీపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన గౌడకులస్తులు పెద్దసంఖ్యలో పోలీస్ కమిషనరేట్‌కు తరలివచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పాత ఎంపీడీవో కార్యాలయం నుంచి సీపీ కార్యాలయం వరకు జిల్లా గౌడ సంఘం, జిల్లా యువజన గౌడ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించగా, తాళ్ల రాంపూర్‌కు చెందిన మహిళలు, గౌడకులస్తులు పాల్గొని సీపీ కార్యాలయం గేటు వద్ద బైటాయించారు. తాళ్లరాంపూర్ వీడీసీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. శ్రీరామనవమి సందర్భంగా కుంకుమార్చనకు వెళ్లిన తమను ఆలయం నుంచి బయటికి పంపించిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని మహిళలు డిమాండ్ చేశారు. అనంతరం గౌడ కులస్తులు మాట్లాడుతూ.. గత ఆరు నెలలుగా గ్రామంలో కల్లు తాగేందుకు ఎవరూ రావడం లేదన్నారు. దీంతో పాటు వీడీసీ సభ్యులు గౌడకులస్తులను లక్ష రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. రామా గౌడ్, సుదర్శన్, సతీశ్, సత్యనారాయణగౌడ్, సారా సురేశ్, దేగాం యాదగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు వేధిస్తున్నారు



నిజామాబాద్ రూరల్: ట్రేడ్ లైసెన్స్ ఫీజు పేరుతో వ్యాపారులను అధికారులు వేధిస్తున్నారని, నోటీసులు ఇవ్వకుండా ఇష్టం వచ్చినట్లు ఫీజులు వసూలు చేస్తున్నారని చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు ఆరోపించారు. హైకోర్టు స్టే ఆర్డర్ ఉన్నా అధికారులు వేధిస్తున్నారని మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కు చాంబర్ అధ్యక్షుడు రావులపల్లి జగదీశ్వర్‌రావు నేతృత్వంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యుల ఐడెంటిటీ సర్టిఫికెట్ చూయిస్తే హై కోర్టు ఆర్డర్ ప్రకారం ప్రస్తుతానికి ట్రేడ్ లైసెన్స్ ఫీజు వసూలు చేయబోమని స్పష్టం చేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో కార్యదర్శి కమల్ ఇనాని, నిశిత రాజు, మోహన్‌రెడ్డి, భక్తవత్సలం, శ్యామ్ అగర్వాల్, వెంకటగౌడ్, దినేశ్‌రెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీనివాసరావు, గంగాధర్‌రావు, జమీల్, హరి ప్రసాద్, ప్రసాద్, దాస్, పటేల్, కొలయ్య, దర్శన్‌సింగ్ ఉన్నారు.

ధాన్యం సేకరణను వేగవంతం చేయాలి



హోన్నాజీపేట్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

- రైస్‌మిల్లుల్లో వెంటవెంటనే అన్‌లోడ్ చేయాలి
- రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

ధర్పల్లి: అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా వెంటవెంటనే రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంతోపాటు హోన్నాజీపేట్ లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన మంగళవారం పరిశీలించారు. తూకం యంత్రాలు, గన్నీ బ్యాగులు, ధాన్యం సేకరణ, మిల్లులకు తరలింపునకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. రైస్ మిల్లుల్లో వెంటవెంటనే అన్‌లోడ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు . జిల్లా వ్యాప్తంగా 700కుపైగా కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేపడుతున్నామని, 250 వరకు కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలకు కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఈ సీజన్‌లో ఇప్పటివరకు 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు వెల్లడించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కలెక్టర్ వెంట డీఆర్డీవో సాయాగౌడ్, ఆర్డీవో రాజేంద్రకుమార్, డీసీవో శ్రీనివాసరావు, డీఎస్‌వో అరవింద్, సివిల్ సప్లయీస్ డీఎం శ్రీకాంత్‌రెడ్డి, తహసీల్దార్ మాలతి, ఎంపీడీవో బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

'ట్రామా కేర్'పై చిగురించిన ఆశలు

- జిల్లా పరిధిలోని జాతీయ రహదారిపై లేని సెంటర్
- క్షతగాత్రులకు గోల్డెన్ అవర్‌లో అందని చికిత్స
- రాష్ట్ర వ్యాప్తంగా 90 కేంద్రాల ఏర్పాటుకు సర్కారు కసరత్తు



ఇందల్‌వాయి: ప్రమాదాల్లో క్షతగాత్రులకు సత్వరమే అత్యవసర చికిత్సలు అందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 90 ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. జాతీయ, రాష్ట్ర రహదారులపై ప్రతి 35 కిలోమీటర్లకు ఒక ట్రామా కేర్ సెంటర్‌ను నెలకొల్పేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. నిజామాబాద్ జిల్లా పరిధిలో సుమారు 75 కి.మీల మేర జాతీయ రహదారి ఉంది. దీనికి అనుసంధానంగా రాష్ట్ర రహదారులు కూడా ఉన్నాయి. వీటిపై నిత్యం ఏదో చోట రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో అత్యవసర చికిత్స అందక కొందరి ప్రాణాలు పోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో ఇందల్‌వాయి, బాల్కొండ, ఆర్మూర్ ప్రాంతాల్లో ట్రామా కేర్ సెంటర్ల ఏర్పాటుపై ఆశలు చిగురించాయి.

అనుకూలంగా ఇందల్‌వాయి పీహెచ్‌సీ

జిల్లాలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై ఒక్క ట్రామా కేర్ సెంటర్ కూడా లేదు. కామారెడ్డిలో ఓ సెంటర్ ఉన్నా నిర్దేశిత వైద్యసేవలందక పోవడంతో క్షతగాత్రులు ఇబ్బందులుపడుతున్నారు. జాతీయ రహదారిని ఆనుకొని కామారెడ్డి, నిజామాబాద్ జిల్లా కేంద్రాలకు సమాన దూరంలో ఉన్న ఇందల్‌వాయి పీహెచ్‌సీని ట్రామా కేర్ సెంటర్‌గా మార్చి నిరంతర వైద్య సేవలందిస్తే క్షతగాత్రులకు దోహదపడే అవకాశం ఉంది.

ఇందల్వాయి పరిధిలో రోడ్డు ప్రమాదాలు

సంవత్సరం	మృతులు	క్షతగాత్రులు
2023	14	9
2024	6	8

అత్యవసర చికిత్స ఆలస్యం అవదు

రాష్ట్రంలో సగటున రోజుకు 21 మంది రోడ్డు ప్రమాదా ల్లో చనిపోతున్నారు. ట్రామా కేర్ సెంటర్ల ఏర్పాటుతో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డవారికి త్వరగా చికిత్స అందే అవకాశం ఉంటుంది. దీంతో రోడ్డు ప్రమాద మరణాలు తగ్గుతాయి. ట్రామాకేర్లను వీలైనంత త్వరగా ఏర్పాటు చేస్తే రోడ్డు ప్రమాద బాధితులకు ఊరట కలుగుతుంది.

– కే మల్లేశ్, సీఐ, డిచ్‌పల్లి

ప్రతిపాదనలు అందించాం



మంత్రి దామోదర రాజనరసింహ జనవరిలో నియోజకవర్గంలో పర్యటించినప్పుడు ఇందల్‌వాయిలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు అవశ్యకతపై వివరించి ప్రతిపాదనలు అందజేశాం. అత్యవసర చికిత్సల కోసం డీఎంహెచ్‌వోతో మాట్లాడి ఇద్దరు అదనపు డాక్టర్లను డిచ్‌పల్లి సీహెచ్‌సీ కేటాయించాం. ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తా.

– ఆర్ భూపతిరెడ్డి, ఎమ్మెల్యే, నిజామాబాద్ రూరల్

యువ వికాసానికి దరఖాస్తుల జోరు

- 7వ తేదీ వరకు 28,828 అప్లికేషన్లు
- ఈ నెల 14 వరకు అవకాశం
- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- బల్దియా, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు



నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న సిబ్బంది (ఫైల్)

నిజామాబాద్‌అర్బన్: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రాజీవ్ యువ వికాసం పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ యువతకు రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు రాయితీతో కూడిన రుణాలు ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానించిన విషయం తెలిసిందే. జిల్లాలోని నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈ పథకానికి మార్చి 15 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. మొదట ఈ నెల 5వ తేదీ దరఖాస్తులకు తుది గడువు ప్రకటించిన ప్రభుత్వం.. గడువు తేదీని ఈ నెల 14కు పొడిగించింది. దీంతో మరింత మంది దరఖాస్తు చేసుకునేందుకు ముందుకొస్తున్నారు.

ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తులకు అవకాశం

రాజీవ్ యువ వికాసం పథకానికి ప్రభుత్వం మొదట ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించింది. ఇటీవల ఆఫ్‌లైన్(ఫారం రూపం)లోనూ దరఖాస్తులను తీసుకుంటోంది. ప్రజాపాలన కేంద్రాల్లో దరఖాస్తు ఫారాలను అందుబాటులో ఉంచింది. అక్కడే దరఖాస్తు ఫారాలను నింపి సంబంధిత ధ్రువపత్రాలు జత చేసి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. దరఖాస్తుదారులు పూరించిన ఫారాలను సంబంధిత మండల కేంద్రాల్లో ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. కాగా, సంబంధిత శాఖల అధికారులు అర్హులందరికీ ఈ పథకం ద్వారా ప్రయోజనం చేకూర్చాలని భావిస్తున్నారు. అందులో భాగంగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.

ధ్రువీకరణ పత్రాల కోసం బారులు

జిల్లా వ్యాప్తంగా మీ సేవ కేంద్రాల్లో నిరుద్యోగ యువత కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు అప్లయ్ చేసుకునేందుకు బారులు తీరుతున్నారు.

సబ్సిడీ ఇలా..

యూనిట్ విలువ	సబ్సిడీ (శాతంలో..)
రూ.50వేల వరకు	100
రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు	90
రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు	80
రూ.2లక్షల నుంచి రూ.4లక్షల వరకు	70

7వ తేదీ వరకు దరఖాస్తులు ఇలా..

ఎస్సీ సంక్షేమ శాఖ	5,161
ఎస్టీ సంక్షేమ శాఖ	2,447
బీసీ సంక్షేమ శాఖ	15,420
మైనారిటీ సంక్షేమ శాఖ	5,800
మొత్తం దరఖాస్తులు	28,828

బల్దియాలో ప్రత్యేక కౌంటర్లు

నిజామాబాద్ సిటీ: రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల స్వీకరణకు నగర బల్దియాలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. అర్హులైన యువత ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. సంబంధిత ధ్రువీకరణ పత్రాలు తీసుకొని మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు ఫారాన్ని పూరించి నేరుగా అధికారులకు ఇచ్చే వెసులుబాటును కల్పించింది.

జతచేయాల్సిన ధ్రువీకరణ పత్రాలు

- పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో
- ఆధార్
- పాన్ కార్డు
- రేషన్‌కార్డు (లేనివారు ఆదాయ ధ్రువీకరణ పత్రం)
- కుల ధ్రువీకరణపత్రం
- బ్యాంకు ఖాతా జిరాక్స్
- విద్యార్హతల సర్టిఫికెట్లు
- శిక్షణ సర్టిఫికెట్ (శిక్షణ పొంది ఉంటే)

యువవికాసం పథకానికి రెండు సర్టిఫికెట్లు ప్రధానం కావడంతో మీ సేవలో దరఖాస్తు చేసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంత యువతకు సంవత్సర ఆదాయం రూ.1,50,000, మున్సిపల్ పరిధిలోని పట్టణ ప్రాంతాల వారికి రూ.2,00,000 ఆదాయం మించకూడదని పథకం గైడ్‌లైన్స్‌లో పేర్కొన్న విషయం తెలిసిందే.

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలోని నిరుద్యోగులు రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకొని నచ్చిన రంగాల్లో ఉపాధి పొందే అవకాశం ప్రభుత్వం కల్పిస్తోంది. సకాలంలో దరఖాస్తు చేసుకుంటే ఎంతో మేలు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– రమేశ్, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి

క్లుప్తంగా

పీజీ పరీక్షల ఫీజు చెల్లించండి

తెయూ(డిచ్‌పల్లి): ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్‌ (పీజీ) ఏపీఈ, ఐఎంబీఏ, ఐపీసీహెచ్‌ 6, 8, 10వ సెమిస్టర్‌ థియరీ, ప్రాక్టికల్‌ రెగ్యులర్‌, బ్యాక్‌లాగ్‌ పరీక్షల ఫీజు ఈ నెల 15వరకు చెల్లించాలని తెయూ కంట్రోలర్‌ ప్రొఫెసర్‌ సంపత్‌కుమార్‌ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో ఈనెల 19 వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందన్నారు. ఎంఏ ఏపీఈ అన్ని సబ్జెక్టులకు రూ.500, ఇంటిగ్రేటెడ్‌ ఎంఎస్సీ ఐపీసీహెచ్‌ అన్ని సబ్జెక్టులకు రూ.600, ఐఎంబీఏ అన్ని సబ్జెక్టులకు రూ.800 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని కంట్రోలర్‌ తెలిపారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

విధుల బహిష్కరణ



ఖలీల్‌వాడి: హైదరాబాద్‌ నాంపల్లి కోర్టు న్యాయవాది మొహమ్మద్‌ ముత్తబాఅలీపై దాడిని నిరసిస్తూ మంగళవారం నిజామాబాద్‌ బార్‌ అసోసియేషన్‌ న్యాయవాదులు ఆందోళన నిర్వహించి, విధులు బహిష్కరించారు. అనంతరం జిల్లాకోర్టు ప్రాంగణంలోని బార్‌ సమావేశపు హాల్‌లో బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు మల్లెపూల జగన్మోహన్‌గౌడ్‌ మాట్లాడుతూ.. న్యాయవాది ముత్తబాఅలీపై దుండగులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. బార్‌ అసోసియేషన్‌ కార్యదర్శి వసంత్‌రావ్‌, ఉపాధ్యక్షుడు పెండం రాజు, సంయుక్త కార్యదర్శి సురేష్‌, రాష్ట్ర కౌన్సిల్‌ సభ్యుడు రాజేందర్‌ రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ వినియోగదారుల పరిష్కార వేదిక

డిచ్‌పల్లి: మండలంలోని బర్ధిపూర్‌ 33/11 కేవీ విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ కార్యాలయంలో బుధవారం విద్యుత్‌ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను నిర్వహించనున్నట్లు డిచ్‌పల్లి డీఈ ఎ రమేశ్‌, ఏడీఈ ఆర్‌ బాలేష్‌ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిజామాబాద్‌ రూరల్‌, మోపాల్‌, సారంగపూర్‌, బర్ధిపూర్‌, జక్రాన్‌పల్లి, పడకల్‌ సెక్షన్లకు సంబంధించిన విద్యుత్‌ వినియోగదారులు ఏవైనా విద్యుత్‌ సమస్యలు ఉంటే ఈ వేదిక ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీజీఆర్‌ఎఫ్‌-2 చైర్మన్‌ నారాయణ, కమిటీ సభ్యులు సలంద్ర రామకృష్ణ, లకావత్‌ కిషన్‌, మద్రిపల్లి రాజాగౌడ్‌ పాల్గొంటారని డీఈ పేర్కొన్నారు.

కల్తీ కల్లుతో ప్రయోగాలు!

ప్రజల ప్రాణాలతో చెలగాటం
- దుర్కిలో కల్తీకల్లు తాగి పలువురికి అస్వస్థత
- జీజీహెచ్‌లో చికిత్స అందిస్తున్న వైద్యులు


జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కల్తీ కల్లు బాధితులు

నిజామాబాద్‌నాగారం: సంపాదనే ధ్యేయంగా కల్లు వ్యాపారులు ఇష్టారీతిన కల్తీ కల్లు తయారు చేస్తూ, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. కల్తీ కల్లు తయారు చేయడంలో ప్రయోగాలు చేస్తూ ఏళ్ల తరబడిగా క్లోరోహైడ్రేట్‌, అల్ప్రాజోలం, డైజోఫామ్‌ తదితర మత్తు పదర్థాలు వాడుతున్నారు. దీంతో ఆ కల్తీకల్లు తాగిన ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. ఇటీవల నస్రూల్లాబాద్‌ మండలం దుర్కిలో కల్తీకల్లు తాగి పలువురు అస్వస్థతకు గురయ్యారు. వారిలో కొంతమందిని చికిత్స నిమిత్తం బాన్సువాడ ఆస్పత్రికి తరలించగా, మరికొంతమందిని నిజామాబాద్‌ జీజీహెచ్‌కు తరలించారు.

72గంటలు వైద్యుల పర్యవేక్షణలోనే..

దుర్కిలో కల్తీ కల్లు తాగి అస్వస్థతకు గురైన వారిలో శివలక్ష్మి, బుజ్జీ, లక్ష్మణ్‌, నరేష్‌, తులసవ్వ, అర్వింద్‌, లచ్చవ్వ, కాశీరాం, రవి, మారుతి, మోహన్‌, బాలమణి, మధు, నాగర్జున్‌లు జీజీహెచ్‌లో ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు.

బాధితులను వైద్యులు పరీక్షించగా, కల్లు వ్యాపారులు ప్రయోగాలు చేయడానికి యాంటి సైకియాట్రిక్‌ గ్రూప్స్‌కు సంబంధించిన కొత్త మందును కలిపినట్లు వైద్యులు అనుమానం వ్యక్తం చేశారు. అందువల్లే బాధితులు తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో కోలుకోవడానికి 72గంటల సమయం పడుతుందని మంగళవారం తెలిపారు. ఈ కల్తీ కల్లు తాగడం వల్ల బాధితులకు గంటల వ్యవధిలోనే నాలుక దొడ్డుగా మారడం, సిరలు పడిపోవడం, నొప్పులు తదితర వచ్చాయి. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు వారిని హుటాహుటిన ఆస్పత్రులకు చికిత్స నిమిత్తం తరలించారు. కల్తీ వ్యాపారులకు, అక్రమార్కులకు పేదల ప్రాణాలంటే లెక్కలేకుండా పోయిందని పలువురు మండిపడుతున్నారు. కల్లులో ప్రయోగాలు చేయడంలో ఎవరైనా చనిపోతే రూ. 20వేల నుంచి రూ. 80వేల వరకు కుటుంబ సభ్యులకు ముట్టజెప్పి చేతులు దులుపుకున్న ఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, కల్తీకల్లు విక్రయాలను అరికట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

మాట్లాడ రాలేదు..



కల్తీకల్లు తాగిన కొద్దిసేపటికే నాలుక దొడ్డుగా అయ్యింది. మాట్లాడటం రాలేదు. సిరలు మొత్తం పడిపోయాయి. మా నాన్న చూసి వెంటనే నన్ను ఆస్పత్రికి తీసుకవచ్చి చికిత్స అందించారు.

– అర్వింద్‌, కల్తీకల్లు బాధితుడు

నా ప్రాణం ఆగమైంది..



ఎప్పటి మాదిరిగానే కల్లు తాగగా, గంటల వ్యవధిలోనే నా ప్రాణం ఆగమైంది. మెడ సిరలు పడిపోయాయి. శరీరమంతా నొప్పులు, నడవకలేక పోయాను. నాలుక సైతం దొడ్డుగా మారింది. కల్లులో ఏదో కలపడంతోనే నాకు ఇలా జరిగింది. నాతో పాటు చాలా మందికి ఇదే పరిస్థితి ఎదురైంది.

– మోహన్‌, కల్తీకల్లు బాధితుడు

నడవలేక పోయాను..



ప్రతిరోజు నేను కల్లు తాగుతాను. కానీ ఈసారి తాగిన కొద్దిసేపటికే నా సిరలు పక్కకు పడిపోయాయి. నడవలేకపోయాను. ఏం జరుగుతుందో కూడా తెలియదు. ప్రస్తుతం కొద్దిగా మంచిగా ఉన్నాను. వైద్యుల వల్ల నా ఆరోగ్యం కాస్త కుదుటపడుతుంది.

– లక్ష్మణ్‌, కల్తీకల్లు బాధితుడు

కొత్త మందు కలపడంతోనే..

కల్లు తాగిన వారిని రకరకాలుగా పరిశీలించాం. కల్లులో అల్ప్రాజోలం, డైజోఫామ్‌ కలిపితే మత్తు వస్తుంది. కానీ ఇందులో కొత్త మందు కలపడంతోనే బాధితుల్లో అనారోగ్య సమస్యలు తీవ్రరూపం దాల్చాయి. ప్రస్తుతానికి వారి ఆరోగ్యం నిలకడగా ఉంది. మరో 72గంటల పాటు వారిని మా పర్యవేక్షణలో ఉంచుకొని, వారి ఆరోగ్యం కుదుటపడిన తర్వాత డిచ్చార్జ్‌ చేస్తాం.

– శ్రీనివాస్‌, సూపరింటెండెంట్‌, ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రి, నిజామాబాద్‌

ఏం ఎండలు బాబోయ్‌


స్కార్ఫ్‌ కట్టుకొని స్కూటీపై ప్రయాణిస్తున్న మహిళ


బిడ్డకు టవల్‌ కప్పి తీసుకెళ్తున్న మహిళ

భానుడు నిప్పులు చెరుగుతున్నాడు. నగరంలో ఎండ తీవ్రత రోజురోజుకూ పెరిగిపోతోంది. మంగళవారం 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇప్పుడే ఇలాఉంటే రానురాను పరిస్థితి ఊహించేందుకే భయంగా ఉందంటున్నారు నగరవాసులు. ఈక్రమంలో ప్రయాణాలు సాగించే ప్రజలు ఎండ వేడిమి నుంచి రక్షించుకోవడానికి స్కార్ఫులు, గోడుగులు, టవల్స్‌ను అడ్డు పెట్టుకుని వెళ్తున్నారు. ఈ దృశ్యాలు 'సాక్షి' కెమెరాకు చిక్కాయి.

– సాక్షి స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌, నిజామాబాద్‌


ఉపశమనం కోసం సోడా తాగుతున్న మహిళలు




స్కార్ఫ్‌లు కట్టుకొని బైక్‌పై ప్రయాణిస్తున్న మహిళలు

డబుల్‌ బెడ్‌రూమ్‌ ఇళ్ల ఆక్రమణ


ధర్పల్లిలో స్థానికులతో మాట్లాడుతున్న అధికారులు

ధర్పల్లి: మండలకేంద్రంలో ప్రభుత్వం నిర్మించిన డబుల్‌ బెడ్‌రూమ్‌ ఇళ్లను పంపిణీ చేయకపోవడంతో ప్రజలు మంగళవారం ఆగ్రహించి, ఇళ్ల తాళాలు తొలగించి, ఆక్రమించుకున్నారు. ధర్పల్లిలో మూడేళ్ల క్రితం 48 డబుల్‌ బెడ్‌రూమ్‌ ఇళ్లను నిర్మించారు. వీటికోసం పలువురు నిరుపేదలు దరఖాస్తు చేసుకున్నారు. ఏళ్లు గడుస్తున్నా ఇళ్లను పంపిణీ చేయకపోవడంతో 30 మంది నిరుపేద కుటుంబాలు ఆగ్రహించి ఇళ్లలోకి ప్రవేశించి, సామగ్రిని భద్రపరుచుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు.

ఇళ్ల పంపిణీ చేయకుండా చొరబడడం చట్టావిరుద్ధమని తహసీల్దార్‌ మాలతి వారికి తెలిపారు. మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని త్వరలో లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లను కేటాయిస్తామన్నారు. ఇళ్లలోకి చొరబడిన వారిని అధికారులు సముదాయించి బయటకు పంపించారు.

నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయొద్దు


సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్‌

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్రంలో నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయొద్దని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్‌ (ఎస్‌ఎఫ్‌ఐ) రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్‌ డిమాండ్‌ చేశారు. తెలంగాణ యూనివర్సిటీలో మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆరవ మహాసభ నిర్వహించారు. ఈసందర్భంగా కిరణ్‌ మాట్లాడుతూ.. యూనివర్సిటీలకు పెద్దపీట వేస్తామని రాష్ట్ర ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చినా ఇప్పటి వరకు ఏ ఒక్కటి అమలు చేయలేదని విమర్శించారు. వెంటనే తెలంగాణ యూనివర్సిటీలో ప్రభుత్వ ఇంజనీరింగ్‌ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్‌ చేశారు. వర్సిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం 15మంది సభ్యులతో కూడిన తెయూ ఎస్‌ఎఫ్‌ఐ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా శివ, అధ్యక్షుడిగా జీషన్‌, వర్సిటీ ఆఫీస్‌ బేరర్స్‌గా నాగేంద్ర, నిరంజన్‌, సంధ్య ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శి రాచకొండ విగ్నేష్‌, జిల్లా ఉపాధ్యక్షుడు దినేష్‌, కమిటీ సభ్యులు సంతోష్‌, కొండల్‌ పాల్గొన్నారు.

ఎస్సెస్సీ మెరిట్‌ విద్యార్థులకు ఫీజు రాయితీ

నిజామాబాద్‌అర్బన్‌: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కాకతీయ ఐఐటి, మెడికల్‌ అకాడమిలో ఫీజు రాయితీ ఇవ్వనున్నట్లు కాకతీయ ఐఐటీ మెడికల్‌ అకాడమీ చైర్‌పర్సన్‌ విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాసంస్థ స్థాపించబడి 35 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మెరిట్‌ విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఫీజు రాయితీ అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. మెరిట్‌ విద్యార్థులకు ఇంటర్‌ విద్యతోపాటు ఐఐటీ, మెడికల్‌ కోచింగ్‌లో ఫీజు రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతీ తరగతిలో ఐదుగురికి మాత్రమే ఈ అవకాశం ఇవ్వనున్నట్లు తెలిపారు. 575కు పైగా మార్కులు వచ్చిన వారికి 100 శాతం ఫీజు రాయితీ, 565కు పైగా మార్కులు వచ్చిన వారికి 75 శాతం, 555కు పైగా మార్కులు వచ్చిన వారికి 60 శాతం, 545కు పైగా మార్కులు వచ్చిన వారికి 50 శాతం, 535కు పైగా మార్కులు వచ్చిన వారికి 45 శాతం, 525కు పైగా మార్కులు వచ్చిన వారికి 40 శాతం, 500లకు పైగా మార్కులు వచ్చిన వారికి 30 శాతం ఫీజు రాయితీ కల్పించనున్నట్లు తెలిపారు. మెరిట్‌ ప్రోత్సాహకాలు రెండు సంవత్సరాలకు వర్తిస్తుందని ఆమె తెలిపారు. పూర్తి వివరాలకు 91820 29525, 91775 56270 నెంబర్లను సంప్రదించాలని ఆమె అన్నారు.

అంబేడ్కర్‌ జయంతి బ్రోచర్‌ ఆవిష్కరణ



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో ఈనెల 14న అంబేడ్కర్‌ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెయూ వీసీ యాదగిరిరావు అన్నారు. ఈమేరకు మంగళవారం తెయూలో కార్యక్రమ బ్రోచర్లను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ.. కార్యక్రమంలో కీలకోపన్యాసం చేయడానికి తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్‌ లింబాద్రి హాజరవుతున్నారని తెలిపారు. ప్రిన్సిపల్‌ ప్రవీణ్‌ మామిడాల, ఎస్సీ సెల్‌ డైరెక్టర్‌ వాణి, ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ఘంటా చంద్రశేఖర్‌ పాల్గొన్నారు.

ఇంటిని కూల్చిన కేసులో నలుగురి రిమాండ్‌

వేల్పూర్‌: మండలంలోని వెంకటాపూర్‌ గ్రామంలో గత నెలలో బచ్చు గంగాధర్‌ అనే వ్యక్తి ఇంటిని అక్రమంగా కూల్చిన కేసులో మంగళవారం నలుగురు గ్రామస్తులను రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై సంజీవ్‌ తెలిపారు. మచ్చర్ల నర్సారెడ్డి, ఏనుగు మోహన్‌ రెడ్డి, రిక్క రాజేశ్వర్‌, ఏనుగు నర్సారెడ్డి లను రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కేసులో ఇప్పటికే నిజామాబాద్‌ జైల్లో కొందరు రిమాండ్‌లో ఉండగా, మరికొంత మంది పరారీలో ఉన్నారని వెల్లడించారు.

వృద్ధుడి అదృశ్యం



మాచారెడ్డి: ఎల్లంపేట గ్రామానికి చెందిన మాలోత్‌ రాజ్యు(60) అనే వృద్ధుడు అదృశ్యమైనట్లు ఎస్సై అనిల్‌ మంగళవారం తెలిపారు. మార్చి 31న మహారాష్ట్రలోని పొరాదేవి దర్శనం కోసం వెళ్లిన రాజ్యు ఇప్పటికీ ఇంటికి తిరిగి రాలేదు. దీంతో అతడి కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్‌

చెరువులో పడి ఒకరి మృతి

ఇందల్వాయి: మండలంలోని గండి తండాలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని గండితండాకు చెందిన విస్లావత్‌ నరేందర్‌ (43) సోమవారం రాత్రి తన పొలం వద్ద ఉన్న బర్రెలకు నీరు పెట్టడానికి ఇంటి నుంచి వెళ్లాడు. ఈక్రమంలో పొలం పక్కన ఉన్న చెరువులో ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. ఈమేరకు మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బావిలో పడి వృద్ధుడు..

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మున్సిపల్‌ పరిధిలోని దేవునిపల్లి శివారులో ఓ వృద్ధుడు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడు. దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపిన వివరాలు ఇలా.. లింగాపూర్‌ గ్రామానికి చెందిన చెట్కూరి ఎల్లయ్య (85) కొద్ది రోజులుగా వృద్ధాప్య కారణాలతో మతిస్థిమితం కోల్పోయాడు. మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చాలాచోట్ల గాలించిన ఆచూకీ దొరకలేదు. దేవునిపల్లి శివారులోని బండారి రాజిరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఉన్న బావిలో ఎల్లయ్య మృతదేహం మంగళవారం తేలింది. సమాచారం అందుకున్న దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి భార్య మల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి..



డిచ్‌పల్లి: డిచ్‌పల్లి రైల్వేస్టేషన్‌ వద్ద సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి పట్టాలు దాటుతూ రైలు ఢీకొని మృతి చెందినట్లు నిజామాబాద్‌ రైల్వే ఎస్సై సాయారెడ్డి మంగళవారం తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదన్నారు. మృతుడు సుమారు 35 సంవత్సరాల వయస్సు ఉంటాడన్నారు. నిజామాబాద్‌ స్టేషన్‌ మేనేజర్‌ దుర్గాప్రసాద్‌ ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడిని ఎవరైనా గుర్తిస్తే నిజామాబాద్‌ రైల్వే పోలీస్‌ ఫోన్‌ నంబర్‌ 8712652591కు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

చికిత్స పొందుతూ ఒకరు..

రెంజల్‌(బోధన్‌): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై చంద్రమోహన్‌ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా.. నవీపేట మండలం నాగేపూర్‌ గ్రామానికి చెందిన మద్దెల మదారి(41)అనే వ్యక్తి సోమవారం అర్ధరాత్రి అత్తగారి ఊరైన రెంజల్‌ మండలంలోని నీలా గ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. మార్గమధ్యలో తాడ్‌బిలోలి గ్రామం వద్ద వడ్ల బస్తాలను ఢీకొనడంతో కిందపడి గాయపడ్డాడు. స్థానికులు గమనించి అతడిని చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలి



బిచ్కుంద(జుక్కల్‌): వాహనదారులు ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలని ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. బిచ్కుంద అంబేడ్కర్‌ చౌరస్తాలో మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించి, ట్రాఫిక్‌ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. వాహనదారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు.

వేర్వేరు కేసుల్లో పలువురికి జైలుశిక్ష

మోపాల్‌: డ్రంకన్‌డ్రైవ్‌ కేసులో ఒకరికి నిజామాబాద్‌ ప్రత్యేక ద్వితీయశ్రేణి న్యాయమూర్తి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. మోపాల్‌లో ఈనెల 4న పోలీసులు డ్రంకన్‌డ్రైవ్‌ తనిఖీలు నిర్వహించగా, జిల్లాకేంద్రానికి చెందిన రహమత్‌ పాష మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. అనంతరం అతడిని కోర్టులో హాజరుపర్చగా జడ్జి 3రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై యాదగిరి గౌడ్‌ తెలిపారు.

డిచ్‌పల్లిలో ఒకరికి..

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని నాగ్‌పూర్‌ గేట్‌ సమీపంలో ఈ నెల 5న ఎస్సై ఎండీ షరీఫ్‌ ఆధ్వర్యంలో పోలీసులు డ్రంకన్‌డ్రైవ్‌ తనిఖీలు నిర్వహించారు. దెగావత్‌ శివరాం (గాంధీనగర్‌ కాలనీ), చొక్కల రాకేష్‌ (సుద్దపల్లి), దేశెట్టి సాయికుమార్‌ (కమలాపూర్‌) మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా జిల్లా సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.

టీస్టాల్‌ నిర్వాహకుడికి..

బోధన్‌టౌన్‌(బోధన్‌): సమయపాలన పాటించకుండా హోటల్‌ నిర్వహిస్తున్న యజమానికి బోధన్‌ కోర్టు ఒకరోజు జైలు శిక్ష విధించినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ మంగళవారం తెలిపారు. పట్టణంలోని రెంజల్‌బేస్‌ కాలనీలో టీస్టాల్‌ నిర్వహిస్తున్న అబ్దుల్‌ మజీద్‌ అనే వ్యక్తి రాత్రి 10:30 గంటల తర్వాత హోటల్‌ నిర్వహిస్తుండటంతో పోలీసులు అతడిని పట్టుకున్నారు. అనంతరం అతడిని బోధన్‌ కోర్టులో హాజరు పరుచగా జడ్జి ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

న్యూసెన్స్‌ కేసులో ఒకరికి..

మాక్లూర్‌: మద్యం తాగి, మత్తులో తరచూ డయల్‌ 100కు కాల్‌ చేసి, పోలీసు విధులకు ఆటంకం కలిగించిన ఓ వ్యక్తికి కోర్టు 2రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై రాజశేఖర్‌ మంగళవారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన మొద్దు గంగాధర్‌ 3 రోజులుగా మద్యం మత్తులో డయల్‌ 100కు ఫోన్‌ చేస్తూ పోలీసు విధులకు ఆటంకం కల్గించటమే కాకుండా ప్రజల్ని ఇబ్బందికి గురిచేశాడు. దీంతో పోలీసులు అతడిని పట్టుకొని కోర్టులో హాజరుపర్చారు. జడ్జి విచారణ జరిపి అతడికి 2రోజుల జైలు శిక్షవిధించినట్లు ఎస్సై తెలిపారు.

నగరంలో ఐస్‌క్రీం షాప్‌ నిర్వాహకుడికి..

ఖలీల్‌వాడి: నగరంలో అర్ధరాత్రి వరకు షాపు తెరచిఉంచిన నిర్వాహకుడికి జిల్లా కోర్టు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఒకటో టౌన్‌ ఎస్‌హెచ్‌వో రఘుపతి మంగళవారం తెలిపారు. దేవిరోడ్డులోని శివశక్తి ఐస్‌క్రీం షాప్‌ను నిర్వాహకుడు అర్ధరాత్రి వరకు తెరచిఉంచడంతో పోలీసులు అతడిని పట్టుకున్నారు. అనంతరం కోర్టులో అతడిని హాజరుపర్చగా జడ్జి రెండు రోజుల జైలుశిక్ష విధించారు. దీంతో అతడిని జిల్లా జైలుకు తరలించామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ సంతోష్‌కుమార్‌

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని మేడిపల్లి అటవీ శివారులో జరిగిన అమీనాబేగం అనే మహిళ హత్యకేసులో నిందితుడు కేతావత్‌ పీరాజీని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సదాశివనగర్‌ సీఐ సంతోష్‌కుమార్‌ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా.. పీరాజీ మేడిపల్లి గ్రామ పరిసరాల్లో తిరుగుతుండగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చామన్నారు. అతడిని విచారించగా అమీనా బేగంపై దాడి చేసినట్లు ఒప్పుకున్నాడని తెలిపారు. మహిళపై దాడి చేసిన కర్రను స్వాధీనం చేసుకొని పీరాజీని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. గాంధారి ఎస్సై ఆంజనేయులు, సిబ్బంది ఉన్నారు.

బంగారం దుకాణంలో చోరీ


సీసీ ఫుటేజీలో రికార్డయిన దుండగుడి కదలికలు

పిట్లం(జుక్కల్‌): మండల కేంద్రంలోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద ఉన్న ఓ బంగారం దుకాణంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రంలోని బంగారు దుకాణాన్ని మంగళవారం ఉదయం నిర్వాహకులు తెరచి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి, సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. గుర్తుతెలియని దుండగుడు సోమవారం అర్ధరాత్రి దుకాణం వెనుక ఉన్న తలుపులు పగలగొట్టి లోపలికి చొరబడి సొత్తును దొంగలించినట్లు తెలిపారు. సుమారుగా 17కిలోల వెండి, 6తులాల బంగారం చోరీ చేసినట్లు బాధితుడు తెలిపాడు. ఈమేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై రాజు తెలిపారు.

ఆలయంలో చోరీకి విఫలయత్నం


హుండీని పరిశీలిస్తున్న పోలీసులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాలపేట పోలీస్‌ స్టేషన్‌ సమీపంలోని రేణుకామాత ఆలయంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి విఫలయత్నం చేశారు. ఆలయంలోని హుండీని పగులగొట్టేందుకు వారు ప్రయత్నించినప్పటికీ హుండీ తలుపు తెరుచుకోకపోవడంతో దుండగులు వెనుదిరిగారు. మంగళవారం ఉదయం ఆలయాన్ని శుభ్రపర్చేందుకు వచ్చినవారు హుండీ తలుపు ధ్వంసమై ఉండడాన్ని గమనించి ఆలయకమిటీ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో ఆలయకమిటీ సభ్యులు అక్కడికి చేరుకొని, నాగిరెడ్డిపేట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆలయానికి చేరుకొని హుండీని పరిశీలించి, వివరాలు సేకరించారు.

ఇద్దరు బాలుర ఆచూకీ లభ్యం

నస్రుల్లాబాద్‌(బాన్సువాడ): బీర్కూర్‌ మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల బాలుర పాఠశాల/హాస్టల్‌ నుంచి అదృశ్యమైన ఇద్దరి విద్యార్థుల ఆచూకీ లభ్యమైంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు 18 గంటల వ్యవధిలోనే ఛేదించారు. పాఠశాలకు చెందిన ఇద్దరు ఎనిమిదో తరగతి విద్యార్థులు కిష్టాపూర్‌ నుంచి కామారెడ్డి వెళ్లారు. అక్కడి నుంచి నిజామాబాద్‌ చేరుకున్నారు. నిజామాబాద్‌ బస్టాండ్‌లో నిద్ర చేసి బాన్సువాడ వెళ్లారు. అక్కడి నుంచి కిష్టాపూర్‌కు రావడంతో పోలీసులు పట్టుకున్నారు. విద్యార్థులను పట్టుకోవడానికి అన్ని సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించామని పోలీసులు తెలిపారు. విద్యార్థులను పట్టుకోవడంతో సిబ్బందిని ఎస్పీ రాజేష్‌ చంద్ర అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నవీపేట: నవీపేట శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఎస్సై వినయ్‌ తెలిపిన వివరాలు ఇలా.. కర్నూలు జిల్లాలోని కోయిలకుంట్ల మండల కేంద్రానికి చెందిన షేక్‌ ఇక్బాల్‌ హుసేన్‌ పాషా ఉపాధి నిమిత్తం నవీపేట మండలానికి వచ్చాడు. మండలంలోని బినోల క్రషర్‌లో అతడు బ్లాస్టర్‌గా పనిచేసేవాడు. మంగళవారం ఉదయం అతడు వాకింగ్‌కు వెళ్లివస్తుండగా వెనుక నుంచి వేగంగా వస్తున్న మినీట్రక్‌ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు. బాధితుడి భార్య షేక్‌ షాహిన్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.